జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 10-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 779 పేజీలు: 4 వెల: రూ.7

## సెటిల్‌మెంట్లు.. గూండాగిరిపై
# గొండు గుర్రు!





* దందాలు సాగిస్తే సహించేది లేదు * అరాచక ముఠాలు, అక్రమ సెటిల్మెంట్లపై ఎమ్మెల్యే గొండు శంకర్ ఆగ్రహం * అత్యుత్తమ ఎమ్మెల్యేల వరుసలో గుర్తింపు
* సొంత క్యాడర్‌కూ కఠిన హెచ్చరికలు

శ్రీకాకుళం, సెప్టెంబర్ 9 (వార్త): గత దశాబ్ద కాలంగా అల్లర్లు, రౌడీయిజానికి దూరంగా ప్రశాంతంగా ఉన్న శ్రీకాకుళం నగరం పరిధిలో ఇటీవల కొందరు సెటిల్మెంట్ల పేరిట అశాంతిని సృష్టించేందుకు యత్నిస్తుండటంపై ఎమ్మెల్యే గొండు శంకర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఎమ్మెల్యేల జాబితాలో ముందు వరుసలో నిలిచి ప్రశంసలు అందుకున్న ఆయన, ఒకవైపు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా భారీ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. అయితే కొందరు ముఠాలుగా ఏర్పడి పార్టీకి, నగరానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించడంపై ఆయన తన అనుచరుల వద్ద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. శ్రీకాకుళం నగరంలోని  కీలక ప్రాంతాల్లో ఎలాంటి బోర్డులు లేని ప్రైవేటు కార్యాలయాలు తెరిచి అక్రమ సెటిల్మెంట్లు, దందాలు సాగిస్తున్న వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో దీనిపై కఠినంగా వ్యవహరించాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తన పేరు గానీ, పార్టీ పేరు గానీ చెప్పుకుని ఎవరైనా బెదిరింపులు, సెటిల్మెంట్లకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని క్యాడర్‌కు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

### శ్రీకాకుళం నగర సమగ్ర అభివృద్ధి పనుల సమాహారం..

అరాచక శక్తుల బెదిరింపులను పక్కనపెట్టి, నగర వికాసానికి శాసనసభ్యులు గొండు శంకర్ బహుముఖ వ్యూహంతో సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంతో ఆయన దూసుకుపోతున్నారు. నగరం అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులు రూ.400లక్షల అంచనా వ్యయంతో శ్రీకాకుళం నగరంలో ఆధునిక సెంట్రల్ లైబ్రరీ నిర్మాణ టెండర్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. రూ.12 కోట్లతో ఇండోర్ స్టేడియం పనులు వేగవంతం కాగా, డిసెంబర్ 2026 నాటికి కేఆర్ స్టేడియం ఆధునీకరణ పనులన్నీ పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించారు. విజయాదిత్య పార్క్ సుందరీకరణలో భాగంగా కొత్తగా బౌండరీ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్‌లు ఫుడ్ కోర్టుల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రధాన రహదారులు, కీలక కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, కొత్త డివైడర్ల నిర్మాణం మరియు ప్లాంటేషన్ (మొక్కల పెంపకం) పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. శ్రీకాకుళం నగరాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు చేపట్టిన సమీకృత కలెక్టరేట్ సముదాయం (ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్) నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులు రూ.200 లక్షలతో నగర పరిధిలోని గూనపాలెం, హడ్కో, ఏపీజే అబ్దుల్ కలాం, ఆర్‌కే నగర్‌లలో పబ్లిక్ పార్కుల అభివృద్ధి టెండర్ ప్రక్రియ సాగుతోంది. శ్రీకాకుళం నుంచి పీజీ పేట/మోపుస్‌బందర్ బీచ్ వరకు 120 అడుగుల వెడల్పుతో 8.89 కిలోమీటర్ల మేర నిర్మించనున్న నూతన రివర్ బండ్ రోడ్డు సమగ్ర పరిశీలన పూర్తయింది. కలెక్టరేట్ వెనుక భాగం నుంచి పొన్నాడ వరకు 900 మీటర్ల మేర నాగావళి నది తీరాన్ని పర్యాటక వాకింగ్‌వేగా మార్చేందుకు డీపీఆర్ సిద్ధమవుతోంది. ల పాతరునివలస స్పోర్ట్స్ కాంప్లెక్స్: పాతరునివలస వద్ద ఇండోర్ స్టేడియంతో పాటు హాకీ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్ నిర్మాణాలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. అక్కడే 9 ఎకరాలలో అత్యాధునిక క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రూ.74 లక్షల అంచనాతో జవాన్ మెమోరియల్ పార్క్ నిర్మాణం, రూ.35 లక్షలతో నగరంలో మోడ్రన్ ధోబీఘాట్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. సివిల్ ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పూర్తి అయ్యాయి. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు 6 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి విస్తరణ, సుందరీకరణ పనులు వేగవంతమయ్యాయి. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ మార్పులతో పాటు ప్రసాద్ పథకం కింద ఇంద్ర పుష్కరిణి, ఆర్చ్ గేట్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. యువతకు ఉపాధి కల్పన ధ్యేయంగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, శిక్షణ కేంద్రాలు పారిశ్రామిక ప్రోత్సాహకాల ద్వారా నగరాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే చర్యలు ప్రారంభమయ్యాయి. 100 కోట్లు 100 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పేరిట కొత్త కార్యక్రమానికి రూపకల్పన చేశారు. జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను జీఎంఆర్ సహకారంతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దనున్నారు. ఉత్తమ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన నాయకుడి స్పష్టమైన అభివృద్ధి మార్గం, మరోవైపు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన వైఖరితో నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని పౌర సమాజం హర్షం వ్యక్తం చేస్తోంది. అయితే ఆయన పేరు చెప్పుకొని దందాలు నిర్వహించే వారిని అడ్డుకోకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదనే సంకేతాలు రావడంతో ఎమ్మెల్యే శంకరన్న తనదైన శైలిలో ఇకపై అరాచక శక్తులకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

## బొడ్డపాడులో..
# గ్రావెల్ దందా!



* లేఅవుట్ల కోసం గ్రావెల్ దోపిడీ * మూడేళ్లుగా సాగుతున్న తవ్వకాలు
* అధికారుల మౌనంపై విమర్శలు * ధ్వంసమవుతున్న జీడితోటలు
* అనుమతుల్లేకుండా తవ్వకాలు, తరలింపుపై స్థానికుల ఆగ్రహం * మూడేళ్లుగా ఇదే తంతు * అధికార పార్టీ నేతల అండదండలు * ప్రభుత్వ ఆదాయానికి గండి



పలాస, సెప్టెంబర్ 9 (వార్త): పలాస నియోజకవర్గంలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో గ్రావెల్ దందా జోరుగా సాగుతోంది. ఎంఐజీ లే-అవుట్ సమీపంలోని జీడితోటలను ధ్వంసం చేసి గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. మైనింగ్, రెవెన్యూ అనుమతులు లేకుండానే గ్రావెల్‌ను తవ్వి వివిధ ఎంఐజీ  లే-అవుట్‌లతో పాటు, ప్రైవేట్ స్థలాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేసీబీలతో మట్టిని తొలగించి గ్రావెల్‌ను ట్రిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. దీనివల్ల జీడితోటలు దెబ్బతింటున్నాయని, భూమి స్వరూపం మారిపోతోంది. గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి మైన్స్, రెవెన్యూ శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందారా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నట్లయితే సంబంధిత శాఖలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా ఇదే ప్రాంతంలో వివిధ దశల్లో పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తవ్విన లక్ష లాది క్యూబెక్ మీటర్ల గ్రావెల్‌ను పలాస-కాశీబుగ్గ ప్రాంతాల్లోని ప్రైవేట్ వెంచర్లు, స్థలాల అభివృద్ధి పనులకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారంలో జేసీబీలు, ట్రిప్పర్లను వినియోగిస్తున్నారని పేర్కొంటున్నారు. స్థానికుల ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ ఖజానాకు గణనీయమైన ఆదాయ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఎంత పరిమాణంలో గ్రావెల్ తవ్వారు? దాని విలువ ఎంత? ప్రభుత్వానికి ఎంత మేర ఆదాయం రావాల్సి ఉంది? అనే అంశాలపై అధికారిక లెక్కలు బయటకు రావాల్సి ఉంది. ఇంతకాలంగా తవ్వకాలు జరుగుతున్నాయన్న స్థానికుల ఆరోపణల నేపథ్యంలో మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారా? చేస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎవరిపైనైనా కేసులు నమోదు చేశారా? జరిమానాలు విధించారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ కలెక్టరేట్ లో ఓ ఉన్నతాధికారి తనకు  బంధువు అని, అధికార పార్టీకి చెందిన నేతలు తమకు అండగా ఉన్నాయంటూ చెబుతున్నాడు. ఈ గ్రావెల్ దందాపై ఉన్నతాధికారులు స్పందిస్తారో.. చూసీచూడనట్టు వదిలేస్తారో వేచి చూడాల్సివుంది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధం

- నరసన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో కీలక నిర్ణయాలు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో హస్తం గుర్తుతో అభ్యర్థులను నిలబెట్టాలని పిలుపు
- నాలుగు మండలాలకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం
- 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి సమష్టిగా కృషి చేయాలని నాయకుల సూచన



**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు నూతన మండల అధ్యక్షులను ఎంపిక చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, 2029 సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి జిల్లా డీసీసీ అధ్యక్షుడు అన్నాజీతో పాటు నరసన్నపేట నియోజకవర్గ 2024 ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి నరసింహమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జి మామిడి సత్యం, నాలుగు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా డీసీసీ అధ్యక్షుడు అన్నాజీ మాట్లాడుతూ రానున్న 2029 ఎన్నికల్లో నరసన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసి ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి మండలం నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను హస్తం గుర్తుపై పోటీకి నిలబెట్టాలని సూచించారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు పార్టీ తరపున అభ్యర్థులను సిద్ధం చేసి గణనీయమైన విజయాలు సాధించే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 20 శాతం విజయాలను సాధించే లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. పార్టీ భావజాలానికి అనుకూలంగా ఉన్న వారిని, మధ్యస్థంగా ఉన్న ప్రజలను కాంగ్రెస్ వైపు ఆకర్షించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపే వారికి వారి అర్హత, సేవలను పరిగణనలోకి తీసుకుని తగిన ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే గ్రామస్థాయి కమిటీలను పటిష్టం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశం అనంతరం నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, పట్టణానికి నూతన అధ్యక్షులను నియమించారు. జలుమూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా గుంట కర్ణవీరుడును ఎంపిక చేసి రాష్ట్ర పార్టీ తరఫున అధికారిక నియామక పత్రాన్ని అందజేసి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా గుంట కర్ణవీరుడు మాట్లాడుతూ జలుమూరు మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని పేర్కొన్నారు. నరసన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా గోండు అప్పారావు, నరసన్నపేట పట్టణ అధ్యక్షునిగా గుత్తు కృష్ణమోహన్, పోలాకి మండల అధ్యక్షునిగా కొంకి అప్పన్న, సారవకోట మండల అధ్యక్షునిగా ఉర్లాన దలయ్యలను నియమించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు తమ తమ మండలాల్లో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి అందరూ ఐక్యంగా పనిచేయాలని సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## నిజాయితీగా పనిచేయడం నేరమా?

- శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ ఆవేదన
- ఆరోపణలను ఖండించిన పారిశుధ్య కార్మిక సంఘ నాయకులు



**పలాస, సెప్టెంబరు 9 (వార్త):** విధి నిర్వహణలో భాగంగా పారిశుధ్య సిబ్బంది నిబంధనల ప్రకారం పనిచేయాలని సూచించడం తన తప్పా? అని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, విధుల్లో క్రమశిక్షణ పాటించాలని చెప్పినందుకే తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శేఖర్‌పై వచ్చిన ఆరోపణలను పారిశుధ్య కార్మిక సంఘ నాయకులు కళింగపట్నం వెంకట్, నిర్మల, పుష్ప, దండు నీలిమ తదితరులు బుధవారం ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేఖర్ విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరిస్తూ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచిస్తున్నారని తెలిపారు. ఆయనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని వెల్లడించారు. ఆరోపణల్లో నిజం ఉంటే సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉండగా.. నేరుగా మీడియాను ఆశ్రయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. కోవిడ్ సమయంలో పారిశుధ్య సిబ్బంది కొరత ఉన్నప్పటికీ విధులకు హాజరై ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. సిబ్బంది కొరత కారణంగా కొందరిని తిరిగి విధుల్లోకి తీసుకున్న నేపథ్యంలో, ప్రస్తుతం వారు ఇన్‌స్పెక్టర్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ఆరోపణలు చేస్తున్నారని సంఘ నాయకులు ఆరోపించారు. సీఐటీయూ నాయకుల చొరవతో కొందరు సిబ్బంది తిరిగి విధుల్లో చేరారని తెలిపారు. పలాసలో విధులు నిర్వహించాలని సూచించిన నేపథ్యంలోనే ఓ మహిళా సిబ్బంది అసంతృప్తితో ఇన్‌స్పెక్టర్‌పై వివిధ ఆరోపణలు చేస్తున్నారని వారు తెలిపారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరారు. విధులను నిబద్ధతతో నిర్వహిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌కు అండగా ఉంటామని సంఘ నాయకులు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో ఆయనను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. నిజానిజాలు తేలే వరకు ఎవరి ఆరోపణలనూ వాస్తవాలుగా పరిగణించరాదని, అధికారిక విచారణ ద్వారా విషయాన్ని పరిష్కరించాలని వారు కోరారు.

## నిజం నిలిచింది.. నమ్మకం గెలిచింది...!



**కొత్తూరు, సెప్టెంబరు 9 (వార్త):** 'నిజం గెలిచింది' కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు లోతుగెడ్డ తులసి వరప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి దీపాలు వెలిగించి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తులసి వరప్రసాద్ రావు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసే నాయకుడని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం నిలబడే నాయకత్వం చంద్రబాబు నాయుడిదేనని తులసి వరప్రసాద్ రావు పేర్కొన్నారు. నిజం కొంతకాలం ఇబ్బందులు ఎదుర్కొన్నా చివరకు విజయం సాధిస్తుందని, ప్రజల నమ్మకమే అందుకు నిదర్శనమని అన్నారు. ప్రజల ఆశీస్సులు, పార్టీ కార్యకర్తల అండతో తెలుగుదేశం పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత లభిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు చంద్రబాబు నాయుడని, ఆయనపై ప్రజల్లో అభిమానం, విశ్వాసం బలంగా ఉందని తులసి వరప్రసాద్ రావు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.3.73 లక్షల ఆదాయం

- 170 రోజుల అనంతరం రెండు హుండీల లెక్కింపు
- పకడ్బందీగా నిర్వహణ

**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీల లెక్కింపును బుధవారం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) పి. మాధవి తెలిపారు. సుమారు 170 రోజుల విరామం అనంతరం ఆలయంలోని రెండు హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు వెల్లడించారు. ఈ రెండు హుండీల ద్వారా ఆలయానికి మొత్తం రూ.3,73,837 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు నగదు రూపంలో సమర్పించిన కానుకలను నిర్ణీత విధానంలో లెక్కించి నమోదు చేసినట్లు పేర్కొన్నారు. హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ అధికారులు, సిబ్బంది సమక్షంలో పకడ్బందీగా నిర్వహించారు. లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ కానుకల మొత్తాన్ని జాగ్రత్తగా లెక్కించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీముఖలింగం దేవస్థానం ఈవో ఏడుకొండలుతో పాటు ఆలయ సిబ్బంది, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ హుండీల ద్వారా గణనీయమైన ఆదాయం సమకూరడంపై అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.



## వరికి ద్రవ జీవామృతంతో మెరుగైన ఫలితాలు

- జమ్మూ గ్రామంలో డ్రోన్ ద్వారా రెండు ఎకరాల్లో పిచికారి
- ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన
- పంటల ఆరోగ్యానికి ద్రవ జీవామృతం ఎంతో ఉపయోగకరమని వెల్లడి



**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** వరి సాగులో ద్రవ జీవామృతం వినియోగించడం ద్వారా పంటలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు విస్తృతంగా అవలంబించడం ద్వారా పంటల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు సాగు వ్యయాలను కూడా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. నరసన్నపేట మండలం జమ్మూ గ్రామంలో బుధవారం సాయంత్రం రైతు రెడ్డి సతీశ్‌కు చెందిన వరి పొలంలో డ్రోన్ సహాయంతో ద్రవ జీవామృతాన్ని పిచికారీ చేశారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే డ్రోన్ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయవచ్చని, శ్రమ కూడా తగ్గుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సమన్వయం చేయడం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ద్రవ జీవామృతం వినియోగం వల్ల నేలలోని సూక్ష్మజీవుల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు పంట ఎదుగుదలకు అవసరమైన సహజ పోషకాలు అందుతాయని తోట రమణ వివరించారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టీం లీడర్ సువర్ణరాజు, వ్యవసాయ శాఖ సహాయకురాలు అమూల్యతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

- సత్యవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వాడకాన్ని తగ్గించాలని సూచన
- నీటి కాలుష్యాన్ని నివారించాలని హెచ్ఎం రత్నమాల పిలుపు



**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నరసన్నపేట మండలం సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వకుళ రత్నమాల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. 'మట్టి వినాయకుడిని పూజిద్దాం.. నీరు కలుషితం కాకుండా కాపాడుకుందాం' అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీ గ్రామంలోని పలు ప్రాంతాల మీదుగా సాగింది. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పర్యావరణహిత విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి వనరులను కాలుష్యం నుంచి రక్షించవచ్చని విద్యార్థులు నినాదాల ద్వారా ప్రజలకు సందేశం అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వకుళ రత్నమాల మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మట్టి విగ్రహాలనే ఉపయోగించాలని సూచించారు. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలను నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు, ఇతర జలాశయాలు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సంప్రదాయ పద్ధతిలో మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా భక్తితో పాటు ప్రకృతి పరిరక్షణకు కూడా తోడ్పాటు అందించినవారమవుతామని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల ద్వారా తమ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజల్లో కూడా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెంట రామచంద్రమూర్తికి ఘన నివాళి

- తొలి తరం కమ్యూనిస్టు నేతగా, వ్యాపారవేత్తగా విశిష్ట సేవలు



**పలాస, సెప్టెంబరు 9 (వార్త):** పలాస ప్రాంత తొలి తరం కమ్యూనిస్టు నేత, ప్రముఖ వ్యాపారవేత్త పెంట రామచంద్రమూర్తి సంతాప సభ బుధవారం కాశీబుగ్గలోని పెంట వీధిలో నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు చిక్కోలు జగదీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, జర్నలిస్టులు, వ్యాపారులు, వైద్యులు, న్యాయవాదులు హాజరయ్యారు. రామచంద్రమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు సన్యాసిరావు మాట్లాడుతూ వ్యాపార కుటుంబంలో జన్మించినప్పటికీ సామాజిక దృక్పథంతో ఆలోచించిన రామచంద్రమూర్తి పలాస ప్రాంత తొలి తరం కమ్యూనిస్టు నేతలతో కలిసి రైతు, యువజన ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆయన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. వ్యాపారవేత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో చివరి వరకు నిజాయితీగా జీవించారని చెప్పారు. ఆధ్యాత్మిక గురువు దేవదాసు దేవదత్తం మాట్లాడుతూ పుట్టుక ఎంత నిజమో మరణం కూడా అంతే నిజమని, అప్పుడిని కోల్పోయిన కుటుంబానికి ఏర్పడే శూన్యతను పూడ్చడం సాధ్యం కాదన్నారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్టు మహారణ మాట్లాడుతూ పెంట వీధి రామచంద్రమూర్తికి ఎంతో రుణపడి ఉందన్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో వెల్డింగ్ షాపు ఏర్పాటు చేయించడంతో పాటు బస్సు సర్వీసు ప్రారంభించి, అందులో పనిచేసిన వారికి ఆర్టీసీలో ఉద్యోగాలు లభించేలా సహకరించారని గుర్తుచేశారు. నగరంపల్లి ప్రాంతంలో నిజాయితీగల కాంట్రాక్టర్‌గా ఆయనకు మంచి పేరుందని తెలిపారు. రామచంద్రమూర్తి కుటుంబ సభ్యుడు కిల్లం శెట్టి నరేష్ మాట్లాడుతూ ఆయన ఆలోచనలు, ఆశయాలు, అందించిన సేవలను కొనసాగించేందుకు కుటుంబ సభ్యులు కృషి చేస్తారని తెలిపారు. ఈ సభలో పలువురు మాట్లాడుతూ రామచంద్రమూర్తి ఆకస్మిక మరణం సమాజానికి తీరని లోటని తెలిపారు . ఆయన అందించిన సేవలు, సూచనలు, సలహాలు, మంచి గుణాలను స్మరించుకున్నారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ సభికులు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

## కళింగసీమ ప్రత్యేక రాష్ట్రమే లక్ష్యం

- 2000 ఏళ్ల చరిత్ర ఉన్నా.. దశాబ్దాలుగా వెనుకబాటుతనం
- వనరులు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక రాష్ట్రం అవసరం
- ప్రముఖ వైద్యుడు దువ్వాడ జీవితేశ్వరరావు



**పలాస, సెప్టెంబరు 9 (వార్త):** కళింగ ప్రాంతానికి సుదీర్ఘ చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిపోయిందని కళింగ సీమ సాధన సమితి కన్వీనర్ డా. దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. ప్రాంతీయ వనరులపై స్థానికులకు అధికారం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా--వైద్య రంగాల అభివృద్ధి కోసం కళింగసీమ ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. క్రీ.పూ. 261లో జరిగిన కళింగ యుద్ధం ప్రపంచ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిందని ఆయన తెలిపారు. అశోకుడి శిలాశాసనాల్లోనూ కళింగ యుద్ధ ప్రస్తావన ఉందన్నారు. యుద్ధానంతరం అశోకుడిలో వచ్చిన పరివర్తన, బౌద్ధ ధర్మ వ్యాప్తిలో కళింగ పాత్ర చారిత్రకంగా ప్రత్యేకమైనదని తెలిపారు. తూర్పు గంగులు, గజపతుల కాలం నాటి నిర్మాణాలు, శ్రీముఖలింగం, అరసవల్లి, పూరీ, కోణార్క్ వంటి కట్టడాలు కళింగ సంస్కృతి వైభవానికి ప్రతీకలని వివరించారు. 1953 తర్వాత ప్రాధాన్యం తగ్గింది. 1932--36 మధ్య మద్రాస్ ప్రెసిడెన్సీకి బొబ్బిలి రాజా శ్రీ రామకృష్ణ రంగారావు నాయకత్వం వహించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ కాలంలో ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉండేదని అన్నారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన అనంతరం కళింగ ప్రాంతం రాజకీయంగా, పరిపాలనాపరంగా తన ప్రాధాన్యాన్ని కోల్పోయిందని చెప్పారు. 'ఉత్తరాంధ్ర' పేరుతో ప్రాంతాన్ని వెనుకబడిన ప్రాంతంగా చూడటం ప్రారంభమైందని ఆరోపించారు. శ్రీకాకుళం ప్రాంతంలో జరిగిన గిరిజన రైతాంగ పోరాటాలు, అనంతరం చోటుచేసుకున్న ఉద్యమాలను ప్రస్తావిస్తూ.. అభివృద్ధి లోపం, భూమి--అటవీ హక్కుల సమస్యలు ప్రజల్లో అసంతృప్తికి కారణమయ్యాయని తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో రైతులు, మత్స్యకారులు, కొబ్బరి, జీడి సాగుదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాల్సి ఉందన్నారు. వనరులు ఉన్నా.. వలసలే దిక్కుగా భావించి కళింగ ప్రాంతానికి సుదీర్ఘ సముద్రతీరం, ఖనిజ, అటవీ వనరులు, ఓడరేవులు ఉన్నప్పటికీ స్థానిక యువతకు తగిన ఉపాధి అవకాశాలు అందడం లేదని దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. విశాఖపట్నం, గంగవరం, మూలపేట తదితర పోర్టులు, ఖనిజ వనరుల అభివృద్ధి ద్వారా స్థానికులకు ఎక్కువ ప్రయోజనం చేకూరేలా విధానాలు ఉండాలని కోరారు. ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలస వెళ్లాల్సి వస్తోందని వెల్లడించారు. విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యవసాయం, మౌలిక వసతుల రంగాల్లో మరింత పెట్టుబడులు అవసరమన్నారు. ప్రాంతీయంగా ఉన్న వనరులకు అనుగుణంగా స్థానిక పరిశ్రమలను ప్రోత్సహిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

### ఆరు జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రం

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలను కలిపి కళింగసీమ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే సొంత బడ్జెట్, పరిపాలనా వ్యవస్థ ద్వారా ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. రైతులు, మత్స్యకారులు, గిరిజనులు, కార్మికులు, యువత సమస్యలకు స్థానికంగా పరిష్కారాలు చూపే విధంగా పాలనా వ్యవస్థ ఉండాలని ఆకాంక్షించారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

"మన భూమి.. మన ప్రజలు.. మన హక్కులు.. మన రాష్ట్రం" అనే నినాదంతో యువత, మేధావులు, రైతులు, మహిళలు ఐక్యంగా ముందుకు రావాలని డా. దువ్వాడ జీవితేశ్వరరావు పిలుపునిచ్చారు. కళింగసీమ ప్రత్యేక రాష్ట్ర సాధన సమితి ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

## గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలి

- బొంతు, సారవకోట పీహెచ్సీలలో మాతృ సురక్ష కార్యక్రమం
- 60 మందికి వైద్య పరీక్షలు
- ఆరోగ్య సంరక్షణపై వైద్యుల సూచనలు

**సారవకోట, సెప్టెంబరు 9 (వార్త):** గర్భిణీలు తమ ఆరోగ్యంతో పాటు గర్భస్థ శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదల కోసం సమతుల్య, పోషకాహారం తీసుకోవాలని బొంతు, సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సుస్మిత, సుధారాణిలు సూచించారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం బొంతు, సారవకోట పీహెచ్సీలలో గర్భిణీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 60 మంది గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యులు సూచించిన మందులు, పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. రక్తహీనత వంటి సమస్యలు తలెత్తకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను వైద్యుల సూచనల మేరకు వినియోగించాలని సూచించారు. గర్భిణీలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, తగినంత విశ్రాంతి తీసుకోవాలని, ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యులు తెలిపారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో ముందస్తు వైద్య పరీక్షలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొని గర్భిణీలకు ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, ప్రసవానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# నిత్యావసర ధరలు వెంటనే తగ్గించాలి

**- ఆకాశాన్నంటుతున్న ధరలతో సామాన్యుల కుటుంబ బడ్జెట్లు ఛిద్రమవుతున్నాయన్న సీపీఐ**

**- బ్లాక్‌మార్కెట్, అక్రమ నిల్వలు, దళారీ వ్యవస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**- నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా**




**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించి సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాల జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకవైపు ప్రజల ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగకపోగా, మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న ధరలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయని అన్నారు. కూరగాయలు కొనాలన్నా, పప్పు వండాలన్నా, వంటనూనె వినియోగించాలన్నా సామాన్యుడు తన జేబును చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యుడి వంటిల్లు అగ్నిగుండంగా మారిందని విమర్శించారు. కుటుంబ అవసరాలకు సరిపడే ఆదాయం లేకపోవడం, అదే సమయంలో ఖర్చులు పెరగడంతో మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. 2014తో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయని శ్రీనివాస్ పేర్కొన్నారు. బియ్యం కిలో ధర రూ.28.06 నుంచి రూ.45.69కు పెరిగిందని, కందిపప్పు రూ.75.94 నుంచి రూ.130.06కు చేరిందన్నారు. అదేవిధంగా సన్‌ఫ్లవర్ వంటనూనె ధర రూ.93.55 నుంచి రూ.192.40కు పెరగడం సామాన్యులపై పడుతున్న భారానికి నిదర్శనమని తెలిపారు. చక్కెర ధర రూ.34.02 నుంచి రూ.70.78కు, ఉల్లిపాయ ధర రూ.26.46 నుంచి రూ.60.19కు, టమాటా ధర రూ.21.44 నుంచి రూ.37.67కు పెరిగినట్లు వివరించారు. ముఖ్యంగా వంటనూనె ధర రెట్టింపుకుపైగా పెరగడం, ఉల్లిపాయ ధర దాదాపు రెట్టింపు కావడం ప్రజల కుటుంబ బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఇంత భారీగా పెరుగుతున్న సమయంలో ప్రజల ఆదాయాలు కూడా అదే స్థాయిలో పెరిగాయా అని ఆయన ప్రశ్నించారు. సామాన్యుడి కొనుగోలు శక్తి రోజురోజుకూ తగ్గిపోతుండగా ధరల పెరుగుదలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, అదే వస్తువు మార్కెట్‌కు చేరేసరికి వినియోగదారుడు అధిక ధర చెల్లించాల్సి వస్తోందని అన్నారు. రైతు వద్ద తక్కువ ధర ఉండగా, వినియోగదారుడి వద్ద అధిక ధర ఉండటం వెనుక మధ్యవర్తులు, దళారీ వ్యవస్థ భారీగా లాభపడుతోందని ఆరోపించారు. రైతు నుంచి వినియోగదారుడి వరకు కొనసాగుతున్న దోపిడీ గొలుసును తెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి సరసమైన ధర అందేలా సమర్థవంతమైన మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెట్, దళారీ వ్యవస్థ కారణంగా అనేక నిత్యావసర వస్తువుల ధరలు కృత్రిమంగా పెరుగుతున్నాయని శ్రీనివాస్ విమర్శించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్‌పై నిరంతర పర్యవేక్షణ చేపట్టి అక్రమ నిల్వలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ధరల పెరుగుదల కేవలం మార్కెట్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలపై నేరుగా ప్రభావం చూపుతున్న అంశమని పేర్కొన్నారు. ఒకవైపు ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుండగా, మరోవైపు రైతుల ఆదాయం కుంచించుకుపోతోందని, మధ్యలో దళారీలు, నిల్వదారులు లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నుల భారాన్ని తగ్గించడం ద్వారా రవాణా ఖర్చులను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంధన ధరలు, రవాణా వ్యయాలు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలపై అదనపు భారం పడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంధనంపై విధిస్తున్న పన్నులు, ఇతర సెస్సులను పునఃసమీక్షించి ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని, బ్లాక్‌మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను పూర్తిస్థాయిలో అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి సామాన్య ప్రజల కుటుంబ బడ్జెట్‌కు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నరసన్నపేట మండల కార్యదర్శి ఆర్. అరవింద్, నాయకులు కృష్ణ, ధర్మారావు, అమోష్, చాణక్య, వసంత్, వెంకటరావు, జమ్మయ్య, రామారావు, సింహాచలం, అచ్చమ్మ, ప్రసాద్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఎంఈఓల తనిఖీలు

**- గోలియాపుట్టి, తమ్మయ్యపేట పాఠశాలల సందర్శన**

**- రికార్డుల నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు**

**- మధ్యాహ్న భోజన నాణ్యతపై వివరాల సేకరణ**



**జలుమూరు, సెప్టెంబరు 9 (వార్త):** జలుమూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎం.వి.ఆర్.ఎస్. ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. విద్యా వ్యవస్థ నిర్వహణ, పాఠశాల రికార్డులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గోలియాపుట్టి, తమ్మయ్యపేటతో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, బోధనకు సంబంధించిన వివరాలు, ఇతర పరిపాలన రికార్డులను పరిశీలించారు. పాఠశాలలకు సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, మెనూ అమలు, విద్యార్థులకు అందుతున్న ఆహారంపై సంబంధిత ఉపాధ్యాయులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓలు పేర్కొన్నారు. పాఠశాలల నిర్వహణలో ఎటువంటి లోపాలకు తావులేకుండా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## లకిమేర ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** నరసన్నపేట మండలం లకిమేర ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 పేడాడ దాలినాయుడు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలు, రికార్డులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. సంప్రదాయ బోధనకు పరిమితం కాకుండా ఆసక్తికరమైన, వినూత్నమైన బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థులను పాఠాల పట్ల ఆకర్షితులను చేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని ఉపాధ్యాయులు నిరంతరం పరిశీలించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను ప్రతి విద్యార్థి సక్రమంగా అలవర్చుకునేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాలను గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని, బోధనలో ఆసక్తికరమైన పద్ధతులను ఉపయోగించడం ద్వారా విద్యా ఫలితాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## వరిలో పొటాష్, జింక్ లోపం గుర్తింపు

**- ఖరీఫ్ పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు**

**- కొన్ని ప్రాంతాల్లో పోషక లోపాలతో పంట ఎదుగుదలపై ప్రభావం**

**- ఎకరాకు 15 కిలోల ఎంఓపీ ఎరువును వినియోగించాలని సూచన**

**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** ఖరీఫ్ సీజన్‌లో కొనసాగుతున్న వరి సాగులో కొన్ని ప్రాంతాల్లో పొటాష్‌తో పాటు జింక్ లోపం అధికంగా ఉన్నట్లు గుర్తించామని రాగోలు వ్యవసాయ శాస్త్రవేత్త మధుబాబు తెలిపారు. పంటల్లో పోషక లోపాలను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడకుండా చూడవచ్చని సూచించారు. బుధవారం వ్యవసాయ శాఖ ఏడీ వెంకట మధు, ఏవో వై. సూర్యకుమారి ఆధ్వర్యంలో నరసన్నపేట మండలంలోని కరగాం, నర్సింగపల్లి, జమ్ము గ్రామాల పరిధిలోని వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట ఎదుగుదల, ఆకుల రంగు, మొక్కల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొన్ని వరి పొలాల్లో పొటాష్, జింక్ వంటి సూక్ష్మ, ప్రధాన పోషకాల లోపం కనిపిస్తోందని వ్యవసాయ శాస్త్రవేత్త మధుబాబు తెలిపారు. పొటాష్ లోపం ఉన్న ప్రాంతాల్లో నివారణ చర్యగా ఎకరాకు 15 కిలోల చొప్పున ఎంఓపీ ఎరువును వినియోగించాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ఎరువుల వినియోగం చేపట్టడం ద్వారా పంట ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోషక లోపాలు, తెగుళ్లు లేదా ఇతర సమస్యలు కనిపించిన వెంటనే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టడం ద్వారా ఖరీఫ్ వరి పంటలో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## తిలారు రైల్వే స్టేషన్ జలమయం

చిన్నపాటి వర్షానికే ..



**- స్టేషన్ ప్రాంగణంలో వర్షపు, మురుగు నీరు నిల్వ**

**- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**

**- సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి**

**జలుమూరు, సెప్టెంబరు 9 (వార్త):** జలుమూరు మండలం తిలారు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో చిన్నపాటి వర్షం కురిసినా భారీగా నీరు నిలిచిపోతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టేషన్‌కు వెళ్లే ప్రధాన దారిలో వర్షపు నీటితో పాటు మురుగు నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ స్టేషన్ పరిసర ప్రాంతం జలమయంగా మారుతోందని, నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు. ఒకసారి నీరు చేరితే సుమారు వారం రోజుల పాటు నిల్వ ఉంటోందని తెలిపారు. రైల్వే స్టేషన్‌కు నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నీటిలో నడుచుకుంటూ స్టేషన్‌కు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ ఉన్న వర్షపు నీటిలో మురుగు కలవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని, దోమలు, ఇతర క్రిములు పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి పారుదల కోసం శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరుతున్నారు. సంబంధిత రైల్వే, స్థానిక అధికార యంత్రాంగం స్పందించి స్టేషన్‌కు వెళ్లే మార్గంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నిల్వ ఉన్న నీటిని తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రం కాకముందే అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## మట్టి విగ్రహాలు పర్యావరణానికి మేలు



**సోంపేట, సెప్టెంబరు 9 (వార్త):** వినాయక చవితి మహోత్సవాలను మట్టి విగ్రహాలుతో జరిపి పర్యావరణానికి హానిలేని మేలైన సంప్రదాయాన్ని అనుసరించాలని కొర్లాం జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి విద్యార్థులను సూచించారు. బుధవారం బాలకృష్ణ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మట్టి విగ్రహాలు పర్యావరణానికి మేలు అనే అంశంపై అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడే బాధ్యతను బాల్యం నుంచే అలవాటు చేసుకోవాలని కోరారు. ప్రకృతిని కాపాడుకోవాలంటే రసాయన రహిత విగ్రహాలు మేలైన సంప్రదాయం అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. లక్ష్మణరావు వైస్ ప్రిన్సిపాల్ ఇ. హరిక్రిష్ణ అధ్యాపక సిబ్బంది, న్యూ డిల్లీ తెలుగు సంఘం సభ్యులు మాల్యాడ యాదవరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మట్టివిగ్రహాలు వితరణ చేశారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** నరసన్నపేట మండలం తామరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) శాంతారావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు చేరుకున్న ఆయన, విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం రుచి, నాణ్యతతో పాటు అందిస్తున్న ఆహారంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో మధ్యాహ్న భోజన పథకం కీలక పాత్ర పోషిస్తుందని ఎంఈఓ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని, ఆహార తయారీ, పంపిణీలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

## 'నిజం గెలిచింది'కి సంఘీభావంగా 53 దీపాలు

**పలాస, సెప్టెంబరు 9 (వార్త):** 'నిజం గెలిచింది' కార్యక్రమానికి సంఘీభావంగా పలాస నియోజకవర్గం లక్ష్మీపురం పంచాయతీ కిష్టిపురం గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు 53 దీపాలు వెలిగించారు. టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుర్ల కృష్ణంరాజు అధ్యక్షతన బుధవారం రాత్రి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టై 53 రోజులు పూర్తయిన సందర్భంగా 'నిజం గెలిచింది' కార్యక్రమం ద్వారా సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు అరెస్టు సమయంలో జరిగిన పరిణామాలపై అప్పట్లో ప్రజల్లో ఆవేదన వ్యక్తమైందన్నారు. 53 దీపాలను వెలిగించడం ద్వారా ఆ 53 రోజుల ఘటనను గుర్తుచేసుకుంటూ ప్రజాస్వామ్య విలువలు, న్యాయం, నిజాయితీ పట్ల తమ నిబద్ధతను చాటుతున్నామని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ కక్షలకు తావుండకూడదని, ప్రజల తీర్పే అంతిమమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు. గ్రామంలో 53 దీపాలతో నిర్వహించిన కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.



## వంశధార కాలువలో పూడిక తీత చేపట్టాలి

**- సాగునీరు అందక 2,600 ఎకరాల పంట భూములు ఎండిపోయే ప్రమాదం**

**- 20 ఏళ్లుగా సమస్యను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతుల ఆవేదన**

**- కాలువలో పూడికతీత పనులు చేపట్టి నీరందించాలని అధికారులకు విజ్ఞప్తి**




**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** వంశధార కాలువకు ఆనుకొని ఉన్న పోలాకి మండలంలోని దండు లక్ష్మీపురం, సత్రవుపేట తదితర ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువ ద్వారా సాగునీరు అందాల్సిన సుమారు 2,600 ఎకరాల పంట భూములు నీటి కొరతతో ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై బుధవారం నరసన్నపేటలోని వంశధార కార్యాలయం వద్ద రైతులతో కలిసి మాజీ సర్పంచ్ ఆది, ఎంపీటీసీ అన్నాజీ రావు మాట్లాడారు. వంశధార కాలువ సమీపంలోనే తమ వ్యవసాయ భూములు ఉన్నప్పటికీ సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కాలువలో పేరుకుపోయిన చెత్త, గుర్రపు డెక్క, ఇతర అడ్డంకులను రైతులే స్వయంగా తొలగించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. సాగునీరు అందక పంటలను కాపాడుకోవడానికి రైతులు సొంతంగా కాలువను శుభ్రం చేసుకుంటున్నారని, అయినప్పటికీ పూర్తిస్థాయిలో నీరు చేరడం లేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు కాలువ పరిస్థితిని పరిశీలించి తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదే సమస్యపై పోలాకి మండలం సత్రవుపేటలో రైతులు బుధవారం నిరసన చేపట్టారు. వంశధార కాలువ ద్వారా సాగునీరు అందక సుమారు 2,600 ఎకరాల పంట భూములు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు సాగు దశలో ఉన్న సమయంలో నీరు అందకపోతే తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ ఏ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపలేదని రైతులు విమర్శించారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది సాగునీటి కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంశధార కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి సాగుభూములకు సక్రమంగా నీరందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యను అత్యవసరంగా పరిగణించి పంటలు ఎండిపోకముందే చర్యలు చేపట్టాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అడ్డపనసలో 'నిజం గెలిచింది'

**- ముఖ్యఅతిథిగా కలమట సాగర్ హాజరు**



**సారవకోట, సెప్టెంబరు 9 (వార్త):** చంద్రబాబు నాయుడు అరెస్టు ఘటనకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సారవకోట మండలం అడ్డపనస గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు నిర్బంధించారని పార్టీ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆ ఘటనకు నేటితో మూడు సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఆ పరిణామాలను గుర్తు చేసుకున్నారు. చివరికి నిజమే గెలుస్తుందనే సందేశంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు కలమట సాగర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమంలో పాల్గొని చంద్రబాబు నాయుడు ఎదుర్కొన్న పరిస్థితులను స్మరించుకున్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. సారవకోట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. 'నిజం గెలిచింది' కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వానికి మద్దతు తెలిపారు.

## నిత్యావసర ధరలు తగ్గించాలి

**-బ్లాక్‌మార్కెట్, దళారీ దోపిడీ అరికట్టాలి**

**- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**

**చాపర సుందర్‌లాల్, లండ వెంకటరావు**



**పలాస, సెప్టెంబరు 9 (వార్త):** నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించి సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తొలగించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర సుందర్‌లాల్, లండ వెంకటరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర సిపిఐ పిలుపు మేరకు పలాస మండలం టెక్కలిపట్నం సచివాలయం వద్ద బుధవారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగకపోగా నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర భారం పడుతోందన్నారు. కూరగాయలు కొనలేని, పప్పు వండాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. 2014తో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని వారు తెలిపారు. బియ్యం కిలో ధర రూ.28.06 నుంచి రూ.45.69కు, కందిపప్పు రూ.75.94 నుంచి రూ.130.06కు, సన్‌ఫ్లవర్ వంటనూనె రూ.93.55 నుంచి రూ.192.40కు పెరిగినట్లు వివరించారు. చక్కెర రూ.34.02 నుంచి రూ.70.78కు, ఉల్లిపాయ రూ.26.46 నుంచి రూ.60.19కు, టమాటా రూ.21.44 నుంచి రూ.37.67కు పెరిగాయని తెలిపారు. వంటనూనె ధర రెట్టింపుకుపైగా పెరగడం సామాన్యుడిపై పడుతున్న భారానికి నిదర్శనమన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోయినా మార్కెట్‌లో వినియోగదారుడు అధిక ధర చెల్లించాల్సి వస్తోందన్నారు. రైతు నుంచి వినియోగదారుడి వరకు మధ్యలో దళారీ వ్యవస్థ భారీగా లాభపడుతోందని విమర్శించారు. కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. నిత్యావసర ధరలపై సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టాలని, అక్రమంగా నిల్వలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి సరసమైన ధర లభించేలా దళారీ వ్యవస్థను నియంత్రించాలన్నారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నుల భారాన్ని తగ్గించి రవాణా ఖర్చులను నియంత్రించాలని కోరారు. ఇంధన ధరలు, రవాణా వ్యయాలు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పలాస మండల కార్యదర్శి ఎం.వెంకటరావు, పి.భగీరథ, కృష్ణ, వైకుంఠ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**పలాస, సెప్టెంబరు 9 (వార్త):** మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. పలాస మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ పాత టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ మార్గంలో శిథిలమైన కాలువ స్థానంలో చేపట్టిన నూతన కాలువ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బస్‌స్టాండ్‌కు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో నిత్యం బస్సులు, ఇతర వాహనాలు, ప్రజల రాకపోకలు అధికంగా ఉంటాయి. కాలువ శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో పాత కాలువను తొలగించి కొత్తవాటిని నిర్మించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ కాలువ సమస్యను ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి పనులు చేపట్టారని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తిచేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పలాస--కాశీబుగ్గ పట్టణంలో రహదారులు, కాలువలు, తాగునీరు, రవాణా తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. పలాస రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోందని, రైతుబజార్ అభివృద్ధి పనులకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సుమారు రూ.120 కోట్లతో చేపట్టిన నీటి పథకంలో భాగంగా పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సహకారంతో పలాస నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి చేస్తున్నారని కామేశ్వరరావు యాదవ్ చెప్పారు. ఈ సందర్భంగా కొత్త సత్యం మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కరెంట్!

**- విద్యుత్ కోతలతో అల్లాడుతున్న జనం**

**సోంపేట, సెప్టెంబరు 9 (వార్త):**
విద్యుత్ కోతలతో జనం అల్లాడుతున్నారు. ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ఉష్ణోగ్రతల పెరుగుదల మరోవైపు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంలో కనీసం ఫ్యాన్ కూడా తిరగడానికి అవకాశం లేకుండా ఇష్టా రాజ్యంగా కోతలు, మరోవైపు లో వోల్టేజ్ సమస్యతో సోంపేట తో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల ప్రజలు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు.

### ఈ ఎల్ ఆర్ పేరుతో ..

విద్యుత్ శాఖ యంత్రాంగం మాత్రం ఈ ఎల్ ఆర్ అంటూ నీటుగా తప్పించుకుంటున్నారు. పగలు అధిక ఉష్ణోగ్రతల వలన విద్యుత్ సరఫరా లో అధికంగా వ్యయం జరుగుతుందని దీన్ని సరి చేసేందుకు ఈ ఏల్ ఆర్ పేరిట విద్యుత్ కోతలు తప్పడం లేదంటూ చల్లగా చెబుతున్నారు. ఈ మాటలతో జనం మరింతగా ఆగ్రహం చెందుతున్నారు. ఉక్క పోతతో చంటి పిల్లలు , వృద్ధులు మిగతా వర్గాలు తట్టుకోలేక నానా అవస్థలు పడుతుంటే అధికారి యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా నిర్లక్ష్యంగా మాట్లాడడం ప్రజలకు పట్టిన దౌర్భాగ్యం అని జనం వాపోతున్నారు.

### రాత్రివేళ కూడా తట్టుకోలేని వేడి ..

ఎల్ నినో ప్రభావంతో రాత్రివేళ ఉష్ణోగ్రతలు కూడా విపరీతంగా ఉంటూ ప్రజలు వేడిని తట్టుకోలేకపోతున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ప్రజలకు కాసింత విశ్రాంతికి అవకాశం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఇన్వర్టర్లు ఉపయోగించే ప్రజలు కూడా ఎక్కువ సమయం వాటిపై ఆధారపడలేక మరోవైపు కరెంటు లేక పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇటువంటి సమయంలో సమస్యను చక్కదిద్దేందుకు పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఎవ్వరూ ఈ సమస్యపై నోరు మెదపడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల్లో తిరుగుబాటు తప్పదని జనం హెచ్చరిస్తున్నారు.



# సాగునీరు లేక రైతుల అవస్థలు

**- గెడ్డలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో నీటి ప్రవాహానికి అడ్డంకి**

**- స్వయంగా తొలగింపు పనులు చేపడుతున్న కొత్తరేవు, సొండిపేట, సత్రావుపేట రైతులు**

**- పశువులకు తాగునీరు లేక ప్రభుత్వాన్ని వేడుకుంటున్న అన్నదాతలు**



**పోలాకి, సెప్టెంబరు 9 (వార్త):** పోలాకి మండలంలోని కొత్తరేవు, సొండిపేట, సత్రావుపేట గ్రామాల రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాలకు సాగునీరు అందించే గెడ్డలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు భారీగా పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వ్యవసాయ పొలాలకు సకాలంలో నీరు అందక వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. గెడ్డలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రైతులే స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. వ్యవసాయ పనులను పక్కనపెట్టి గెడ్డలోని చెత్తాచెదారం, కలుపు మొక్కలను తొలగిస్తూ నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించేందుకు శ్రమిస్తున్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో నీరు పారే పరిస్థితి లేకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వరి పంటకు కీలక సమయంలో సాగునీరు అందకపోవడం వల్ల పంటలు ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగిన నేపథ్యంలో పంటలు దెబ్బతింటే ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. సాగునీటి సమస్యతో పాటు పశువులకు తాగునీరు కూడా అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలిపారు. గెడ్డలో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను యంత్రాల సహాయంతో పూర్తిస్థాయిలో తొలగించి, సాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి గెడ్డను శుభ్రపరచడంతో పాటు మూడు గ్రామాల రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని కొత్తరేవు, సొండిపేట, సత్రావుపేట గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.



# 53 దీపాలతో 'నిజం గెలిచింది'

**పలాస, సెప్టెంబరు 9 (వార్త):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు ఘటనకు గుర్తుగా పలాస--కాశీబుగ్గలో 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు 53 దీపాలను వెలిగించి చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు. 2023 సెప్టెంబరు 9న చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసి 53 రోజులపాటు జైలులో ఉంచిన ఘటనను గుర్తుచేసుకుంటూ దీపాలను వెలిగించారు. ఆ సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయని నాయకులు తెలిపారు. చంద్రబాబుపై అప్పటి ప్రభుత్వం నమోదు చేసిన కేసులు, అరెస్టు తీరుపై టీడీపీ శ్రేణులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు.

'ధర్మమే అంతిమంగా గెలుస్తుందని', 53 దీపాల వెలుగుల కార్యక్రమాన్ని కేవలం జ్ఞాపక కార్యక్రమంగా కాకుండా.. రాజకీయ ప్రతికూల పరిస్థితుల్లో పార్టీ శ్రేణులు ఎదుర్కొన్న పోరాటానికి ప్రతీకగా టీడీపీ నాయకులు అభివర్ణించారు. తాత్కాలికంగా అధర్మం పైచేయి సాధించినా.. చివరికి నిజం, ధర్మమే విజయం సాధిస్తాయనే సందేశాన్ని 'నిజం గెలిచింది' ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. చంద్రబాబు అరెస్టు సమయంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎదుర్కొన్న పరిస్థితులు, అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలను నాయకులు ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం చంద్రబాబు నాయకత్వంలో పార్టీ శ్రేణులు మరింత ఐక్యంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నరసన్నపేటలో టీడీపీ కొవ్వొత్తుల ర్యాలీ

**నరసన్నపేట, సెప్టెంబరు 9 (వార్త):** తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు గురైన ఘటనకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నరసన్నపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొవ్వొత్తులను చేతబట్టి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహిస్తూ చంద్రబాబు నాయుడుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బొగ్గు అర్చన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచిన ఘటనను గుర్తు చేసుకున్నారు. ఆ ఘటన ప్రజాస్వామ్య చరిత్రలో బాధాకరమైన పరిణామంగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు.

ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురైనా చంద్రబాబు నాయుడు ధైర్యంగా నిలబడి ప్రజల కోసం పోరాటం చేశారని అన్నారు. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని పార్టీ శ్రేణులకు ధైర్యాన్ని నింపారని తెలిపారు. ఆ ఘటన జరిగి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా చంద్రబాబు నాయుడికి సంఘీభావం తెలియజేసేందుకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభమైన కార్యక్రమంలో చంద్రబాబు నాయుడికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.



## రాజశేఖర్ జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు

**- వృద్ధులు, నిరుపేదలు, దివ్యాంగులకు నిత్యావసర వస్తువుల పంపిణీ**



**జలుమూరు, సెప్టెంబరు 9 (వార్త):** జలుమూరు మండలంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రం శ్రీముఖలింగం గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని క్యాంప్ కార్యాలయం రాజీవ్ భవన్‌లో 41వ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, 2024 శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి నాయుడుగారి రాజశేఖర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. 'గ్రామ సేవే రామ సేవ' అనే లక్ష్యంతో సమాజ సేవ కోసం ఏర్పాటు చేసిన నాయుడుగారి ఫౌండేషన్ ద్వారా వృద్ధులు, నిరుపేద మహిళలు, అభాగ్యులు, దివ్యాంగులకు వివిధ నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సుమారు రూ.10 వేల విలువైన దుప్పట్లు, చీరలు, రేషన్ కిట్లు, పండ్లు, మిఠాయిలను అవసరమైన వారికి అందజేశారు. జన్మదిన వేడుకలను కేవలం వ్యక్తిగత వేడుకగా నిర్వహించకుండా, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూత అందించే సేవా కార్యక్రమంగా నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో నాయుడుగారి ఫౌండేషన్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, నాయుడుగారి ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు, జూనియర్ లెక్చరర్ శైలజ, రిటైర్డ్ ఈఈ జగదీష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయుడుగారి రాజశేఖర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## చంద్రబాబు అరెస్టు.. ప్రజా ఉద్యమానికి నాంది

**-వైసీపీకి ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం ఇచ్చారు**

**-సెప్టెంబరు 9 చీకటి రోజు: మాదారపు వెంకటేష్**

**శ్రీకాకుళం, సెప్టెంబరు 9 (వార్త):** నవ్యాంధ్ర నిర్మాత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అప్పటి వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు మాదారపు వెంకటేష్ ఆ రోజులను గుర్తుచేశారు. చంద్రబాబు అరెస్టు తెలుగు ప్రజల గుండెలను రగిలించిన రోజని, అదే సమయంలో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తమ తీర్పుతో సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్న రోజని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో చంద్రబాబు నిరంతరం శ్రమించారని వెంకటేష్ తెలిపారు. మూడు దఫాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన సీనియర్ నాయకుడిని కనీస గౌరవం, మర్యాద లేకుండా అర్ధరాత్రి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. చంద్రబాబుపై కేసు నమోదు చేసి జైలుకు పంపిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైందని వెంకటేష్ అన్నారు. చంద్రబాబు విడుదల కోసం తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ, విదేశాల్లోనూ అభిమానులు, తెలుగువారు ఆందోళనలు నిర్వహించారని తెలిపారు. 53 రోజుల అనంతరం చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చినప్పుడు ప్రజలు పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారని పేర్కొన్నారు. నేటి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు రవీంద్ర, శ్రీకాకుళం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కూన రవికుమార్ తదితర టీడీపీ నేతలు, కార్యకర్తలపై అప్పటి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేసిందని వెంకటేష్ ఆరోపించారు. చంద్రబాబును పరామర్శించేందుకు వెళ్లిన పవన్ కల్యాణ్‌ను అడ్డుకోవడం, చంద్రబాబును కలిసేందుకు వెళ్లిన నారా లోకేష్ నిరసనకు దిగాల్సి రావడం అప్పటి పరిస్థితులకు నిదర్శనమన్నారు. చంద్రబాబును జైలుకు పంపడంతో ప్రజల సహనం నశించిందని, అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును స్పష్టంగా వెల్లడించారని వెంకటేష్ అన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలను తిరస్కరించి తెలుగుదేశం పార్టీకి ప్రజలు అండగా నిలిచారని తెలిపారు. చంద్రబాబుపై నమోదైన కేసుల్లో న్యాయస్థానాల్లో జరుగుతున్న పరిణామాలను ప్రస్తావిస్తూ, ఆయనపై పెట్టిన కేసులు న్యాయపరమైన పరిశీలనను ఎదుర్కొంటున్నాయని వెంకటేష్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.

### తెలుగు ప్రజలకు కృతజ్ఞతలు

చంద్రబాబు అరెస్టు సమయంలో ఆయనకు, తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన తెలుగు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభిమానులు, కార్యకర్తలకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిలిచిన ప్రతి ఒక్కరికీ అభివాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, తెలుగు జాతి సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు పనిచేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రగామి రాష్ట్రంగా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. నిజం గెలిచిందని, న్యాయం నిలిచిందని వెంకటేష్ పేర్కొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546